www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 21 అక్టోబర్ 2023 | 5 | కాకినాడ

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఎంపీలు

రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్‌ను శుక్రవారం కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, కాకినాడ ఎంపీ వంగా గీత తనిఖీలు చేసి పరిశీలించారు. అనంతరం వారు స్టేషన్‌ను పరిశీలించారు. ఫ్లాట్‌ఫారాలపై పారిశుధ్య నిర్వహణ, ప్రయాణికులకు అందుతున్న సేవలు, వసతులు పరిశీలించారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, మద్దాల శ్రీను, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీలో సమస్యల తిష్ట

- నగరంలో నేటికీ ముంపులో కాలనీలు
- అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ
- విలీనానికి నోచని పరిసర గ్రామాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకినాడ నగరంలో దీర్ఘకాలిక సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. స్మార్ట్ సిటీ నగరంగా ఎంపికై సుమారు రూ.1000 కోట్లు నిధులతో అభివృద్ధి చేసినా సమస్యలు తిష్ట వేసుకుని కూర్చున్నాయి. పారిశుధ్య నిర్వహణ నుంచి మొదలుకొని ముంపు సమస్య పరిష్కారం వరకూ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అసౌకర్యాలు నడుమ నగరవాసులు జీవిస్తున్నారు. అధికారుల అలసత్వంతో అల్లాడుతున్నారు.

దాదాపు 4 లక్షల మంది జనాభా నివసిస్తున్న కాకినాడ నగరం 31.69 చ.కిమీ. (50 డివిజన్లు)గా విస్తరించి ఉంది. ప్రణాళికాబద్ధంగా నిర్మించిన నగరంగా, పింఛనుదారుల స్వర్గధామంగా నగరానికి పేరుంది. ఇంతలా పేరున్నా పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారింది. ఇక్కడ 100 మురికి వాడలు ఉండగా 300 కిలోమీటర్ల మేర మురుగు నీటి కాలువలు ఉన్నాయి. రోజుకు సుమారు 240 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. గొడారిగుంట, రేచర్లపేట, కొత్త కాకినాడ, సంజయ్ నగర్, దుమ్ములపేట, పర్లోపేట, చిన్న మార్కెట్ ఏరియా, రామకృష్ణారావుపేట, ఏటిమొగ తదితర ప్రాంతాల్లో శానిటేషన్ సమస్య తీవ్రంగా ఉంటున్నా అధికారుల చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ పని చేసి వెళ్లిన స్వప్నికల్ దినకర్ పుండ్కర్ హయాంలో కొంత మెరుగుదల కనిపించినా ఆ తర్వాత నుంచి శానిటేషన్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జనాభాకు తగ్గట్టుగా సిబ్బంది లేరు. ప్రతి 100 మందికి ఇద్దరు పారిశుధ్య సిబ్బంది ఉండాల్సి ఉన్నా ప్రస్తుతం 500 మందికి ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. పూర్తిస్థాయిలో కాంట్రాక్ట్ సిబ్బందిని నియమించడం లేదు. ఉన్న వారిలో 100 మంది వరకు అధికారులు, ఇతర ప్రభుత్వ ప్రతినిధుల ఇళ్లల్లో పనిచేస్తున్నారు. ఇప్పుడున్న జనాభాకు 5 వేల మంది సిబ్బంది నియామకం చేయాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల మైదానాల్లో చెత్తలను తరలించకుండా దగ్ధం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్ ఎప్పుడూ శ్మశానం తరహాలో పొగ చూరుతూ ఉంటుంది. లోపలి ప్రాంతాల్లో వారానికి రెండు రోజులు మాత్రమే శానిటేషన్ జరుగుతోంది. ఆరోగ్య విభాగం అధికారి ఎప్పుడూ కార్యాలయానికి మాత్రమే పరిమితమయ్యి ఉంటారు. వంతెనల దిగువన పారిశుధ్య నిర్వహణ చేయడం లేదు. ఇంద్రపాలెం, చీడిగ గ్రామాల చెత్తలను సామర్లకోట రోడ్ కెనాల్ వద్ద మేడలైను వంతెన వద్ద వేస్తుండడంతో సమస్యలు తప్పడం లేదు. తూరంగిలో కాకినాడ నగర డ్రైన్ వ్యర్థాలు చేరడం వల్ల అనారోగ్య బెడద ఎక్కువయ్యింది. బాలయోగి విగ్రహం జంక్షన్ నుంచి మహాలక్ష్మి నగర్ వైపు మేజర్ డ్రెయిన్లు నిర్మిస్తే ఈ బెడద తొలిగే అవకాశం ఉంటుంది. కల్వర్టుల క్లీనింగ్ లేదు. మెయిన్ రోడ్ క్రాస్ కల్వర్టు క్లీనింగ్ చేపట్టడం లేదు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంటులను జిల్లాలో ఏర్పాటు చేస్తే నగర గ్రామాల్లో ఉన్న చెత్త బెడద తొలగుతుంది. ఇందుకు ప్రభుత్వ భూములు ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో చిల్లంగి, పెద్దాపురం తదితర ప్రాంతాలను ఎంపిక చేశారు. స్మార్ట్ సిటీ ప్రణాళికలో బయో గ్యాస్ ఉత్పత్తి చేస్తామని పట్టించుకోవడం మానేశారు.

కాకినాడ నగరంలో ముంపునకు గురైన ఒక ప్రాంతం (ఫైల్ ఫొటో)

ముంపు సమస్యతో ఇబ్బందులు

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిస్తే ప్రధాన రహదారులు జలమయం అవుతున్నాయి. ఏలేరు నుంచి అదనపు జలాలు వదిలినప్పుడు కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం మీదుగా కాకినాడలోని గాడేరు, ఉప్పుటేరు వరద వచ్చి చేరుతోంది. ఆయా కాలువలు పొంగి లోతట్టు ప్రాంతాలన్నీ ముంపు బారిన పడుతున్నాయి. తీర ప్రాంతం ప్రభావంతో బ్యాక్ వాటర్ తోనూ ముప్పు వస్తుంది. దీంతో పాత బస్టాండ్, కచేరిపేట, టీచర్స్ కాలనీ, ట్రెజరీ కాలనీ, జగన్నాథపురంలో పప్పుల మిల్లు ప్రాంతం, వెంకటేశ్వర కాలనీ, తులసి బృందావన్ కాలనీ, ప్రేజరుపేట, గొల్లపేట, జనచైతన్య కాలనీ, పద్మనాభ నగర్, ఎస్.అచ్యుతాపురం, చినస్వామినగర్ తదితర ప్రాంతాలు నీట మునిగిపోతున్నాయి.

ఇంకా అనేక సమస్యలు

కాకినాడ నగర పాలక సంస్థలో అనేక సమస్యలు వేధిస్తున్నాయి. కౌన్సిల్ కాలం ముగిసినప్పటి నుంచి జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉన్నారు.పాలన ఏర్పడి ఏడాది దాటినా సమస్యలు పరిష్కారాల అంశంపై ప్రత్యేక సమావేశం జరగలేదు. అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న విలీన అంశం నేటికీ పరిష్కారం కాలేదు. తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట గ్రామాలు, టీచర్స్ కాలనీ, గంగనాపల్లి పరిధికి చెందిన 42, 46 డివిజన్ ప్రాంతాల విలీనం కేసులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అనధికారిక కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సిటీ ప్లానింగ్‌పై ఎటువంటి అజమాయిషీ జరగడం లేదు. పార్కుల్లో 80 శాతం దీపాలు వెలగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. 50 శాతం వీధుల్లో అంధకారం నెలకొంటుంది. పోయిన వాటి స్థానంలో కొత్తవి వేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నులు, వాటి కుళాయి పన్నులు వసూళ్ల సక్రమంగా జరగడం లేదు.

రాష్ట్ర ప్రభుత్వ భవనాల ఆస్తిపన్ను బకాయి అపరాధ రుసుముతో రూ.50 కోట్లు 2002 నుంచి వసూలు చేయడం లేదు. కేంద్ర కార్యాలయం భవనాల ఆస్తి పన్ను బకాయి రూ.12 కోట్లు ప్రభుత్వ భవనాల కుళాయి పన్ను బకాయి రూ.8 కోట్లు ఉన్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను సామాన్యులు చలానా చెల్లింపు పరంగా పొందే వీలులేక దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. కుళాయి పైపు లైన్ల లీకేజీలు మురుగు కాలువల్లో పైపులైన్లు సరి చేయించే ప్రత్యేక డ్రైవ్ లేకపోవడం వలన అనేక ప్రాంతాల్లో తాగునీరు కొనుక్కుని తాగాల్సి వస్తోంది.



దీక్షలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చక్రవర్తి

కొనసాగుతున్న యుటిఎఫ్ దీక్షలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగుతుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చక్రవర్తి అన్నారు. కాకినాడ యుటిఎఫ్ హోమ్ వద్ద దీక్షలు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లను జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఉపాధ్యాయులకు ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు కెవి.నగేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరవధిక నిరాహార దీక్షలు జరుగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఒపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నేత ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఒపిఎస్ అమలు చేసే వారికే మా ఓటు అని నినాదాలు చేశారు. గతరాత్రి అర్ధరాత్రి దాటిన తరువాత పోలీసులు నిరాహార దీక్షను భగ్నం చేయడం దారుణం అన్నారు. ఈ దీక్షలో జె.ప్రసాద్, జి.రాజు, బి.గోవిందరావు, ఎస్.కె బాబా, కె.హరిబాబు, ప్రభాకర్ రావు, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

స్పందనలో పాల్గొన్న కలెక్టర్

ఎస్‌సి, ఎస్‌టి ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న ప్రత్యేక స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాల్లో ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక స్పందనలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిఆర్‌ఒ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ వెంకట రమణా రెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులకు పంపించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించవలసిందిగా ఆదేశాలిచ్చారు. భూ సమస్యలు, రెవెన్యూ సేవలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పెన్షన్ తదితర అంశాలపై మొత్తం 31 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి వర్గాల సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి నెలా మూడో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక స్పందనలో అందిన ప్రతి అర్జీనీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. ఉద్యోగుల జీతాలు, ఇంక్రిమెంట్స్, బదిలీలు, క్రమశిక్షణ చర్యలు వంటి ఇతర అంశాలపై 22 అర్జీల అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ ఎఒ జిఎస్‌ఎస్.శ్రీనివాసు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

చేనేత ఉత్పత్తులకు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాల్లో చేనేత ఉత్పత్తులకు విస్తత ప్రచారం, ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం ఈ నెల 20 నుండి 24వ తేదీ వరకూ 5 రోజుల పాటు హ్యాండ్ లూమ్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఖాదీ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం కాకినాడ దేవాలయం వీధి పైడా చలమయ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 2 నుంచి 31 వరకు ఖాదీ మహోత్సవ్ పేరుతో దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో చేనేత ఉత్పత్తులకు విస్తత ప్రచారం ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం భారత ప్రభుత్వ చేనేత శాఖ ఆధ్వర్యంలో కాకినాడ పట్టణంలో నేటి నుంచి ఐదు రోజులపాటు హ్యాండ్లూమ్ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో కార్యక్రమంలో చేనేత కార్మికులు, హస్త కళాకారులు, ఖాదీ సొసైటీలు తయారు చేసిన వస్తువులు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్ముకునేందుకు వీలుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. హ్యాండ్లూమ్ ఎక్స్ పో కార్యక్రమంలో 27 స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇందులో 23 స్టాళ్లు హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు కేటాయించగా రెండు స్టాళ్లు హ్యాండీ క్రాఫ్ట్స్‌కు రెండు స్టాళ్లు ఖాదీ ఉత్పత్తులకు కేటాయించారన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో రాయలసీమ నుండి ఉత్తర కోస్తా వరకూ వున్న 14 జిల్లాలతో పాటు తెలంగాణా రాష్ట్రానికి సంబంధించి వరంగల్ చెందిన వస్త్రాలతో స్టాళ్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నాణ్యతతో కూడిన ఉప్పాడ, మంగళగిరి, చీరాల, శ్రీకాళహస్తి, కలంకారీ రకాలకు చెందిన చేనేత వస్త్రాలు ప్రదర్శించినట్లు కలెక్టర్ వివరించారు. దసరా పండుగ పురస్కరించకుని ముందుగానే కాకినాడలో ఏర్పాటు చేసిన చేనేత ఎక్స్‌పో వస్త్ర ప్రదర్శనను కుటుంబ సమేతంగా సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కృతికా శ క్లా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ చేనేత శాఖ డిడి అనిల్ సాహు, కన్సల్టెంట్ హిమజ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అమరవీరులను గుర్తించుకోవాలి

ప్రజాశక్తి -కరప

దేశ సమగ్రతను కాపాడేందుకు మన దేశం మనమట్టి కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా నిర్వహించినట్టు ఎంపిడిఒ కె.అప్పారావు తెలుపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని గ్రామాల్లో సేకరించిన మట్టి కలశాలతో మానవహారం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఇఒపిఆర్‌డి సలాది శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి కుమార్, ఎంపిటిసి భాస్కర్, వై.ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రోగ్రామ్‌లో పాల్గొన్న ఆదిత్య విద్యార్థులు, సిబ్బంది

ఆదిత్య కళాశాలలో పర్సనాలిటీ డెవలప్మెంట్ ప్రొగ్రాం

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రెండు రోజుల స్టూడెంట్ పర్సనాలిటీ డెవలప్మెంట్ అండ్ స్టడీ స్కిల్ ప్రోగ్రామ్‌ను డాక్టర్ జె.జగన్నాథరావు ఆధ్వర్యాన శుక్రవారం ప్రారంభించారు. జీవితంలో విజయానికి అనుసరించాల్సిన విషయాలను విద్యార్థులకు అతి సులభమైన విధానంలో వివరించారు.

ఇంటింటా 'బాబుతో నేను' ప్రచారం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్, యు.కొత్తపల్లి

చంద్రబాబు అరెస్ట్ రిమాండ్‌పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తూ శుక్రవారం సామర్లకోటలోని 25, 26 వార్డుల్లో బాబుతో నేను ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేశారు. టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్ బలుసు వాసు, నాయకులు బి.త్రిమూర్తులు, ఎండి షఫీ ఉల్లా, ఎండి సైపుల్ల, పడాల వీరబాబు, గోలి ధర్మరాజు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** రానున్న ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలబడి అభివద్ధి పథంలో నడిపించే నాయకుని ఎన్నుకోవాలని పిఠాపురం మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి అధికార ప్రతినిధి ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అన్నారు. యు.కొత్తపల్లి మండలం ఎండపల్లిలో శుక్రవారం బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి మహిళలకు టిడిపి హయాంలో చేసిన అభివృద్ధిని వివరించి టిడిపి అధికారం చేపడితే అమలయ్యే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రూ.13 కోట్లతో టిడిపి హయాంలో ఎండపల్లి గ్రామాన్ని అభివద్ధి చేశామని తెలిపారు. గ్రామంలో కళ్యాణ మండపం నిర్మిస్తే వాటిని సచివా లయాలుగా నిర్వహి స్తున్నందుకు వైసిపి ఎంఎల్‌ఎ సిగ్గుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్.అప్పలరాజు, అధ్యక్షులు అనిశెట్టి సత్యానంద రెడ్డి పాల్గొన్నారు. **జగ్గంపేట రూరల్** మండలంలోని గుర్రప్పాలెం, భావవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ మహిళా శక్తి చైతన్య రథయాత్ర నిర్వహించారు. పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, బుర్రి సత్తిబాబు, పోలినాటి ధర్మానందకుమారి, గుమ్మల అనంతలక్ష్మి, గొల్లవల్లి శ్రీదేవి, రాపాక లక్ష్మి, గెద్దాడ సత్యవేణి, ఎల్లాటి అమ్మాజీ, చెక్క మరియా, తిప్పన సత్యవతి, గొల్లవిల్లి వరలక్ష్మి, కడారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

యు.కొత్తపల్లిలో..

నాడు- నేడు పాలనపై ఆలోచించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

చంద్రబాబు హయాంలో నాటి పాలన నేటి ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలు, ద్యోగులు ఆలోచించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ అన్నారు. పి.మల్లవరంలోని ఆయన తన స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రన్న హయాంలో దసరా, దీపావళి, రంజాన్ వంటి ప్రముఖ పండుగలకు వారం ముందే జీతాలందుకున్న రోజుల నుంచి, జగనన్నా.. మా జీతాలన్నా.. మమ్మల్ని కరుణించన్నా.. అనే రోజులు వచ్చాయన్నారు. ఒకటో తేదీ తేదీనే మర్చిపోయిన రోజులొచ్చాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకటో తేదీన జీతాలు పడిన సంఘటనలు అరుదు అన్నారు. ప్రజలు, విద్యావంతులు, ఉద్యోగులు రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తున్న తీరును అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్టూ'నిజం'



జగనన్న ఆరోగ్య సురక్షతో భరోసా

ప్రజాశక్తి - తాళ్లరేవు, యు.కొత్తపల్లి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని ముమ్మిడివరం ఎఎంసి. చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. శుక్రవారం పి.మల్లవరంలో సర్పంచ్ దున్నా సత్యనారాయణ అధ్యక్షతన హైస్కూల్లో జరిగిన సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ ఆరోగ్య రక్షణ కల్పించేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. గాడిమొగ, తాళ్లరేవు పిహెచ్‌సి వైద్యులు జయభార్గవి, ఈశ్వర్, సురేష్, కంటి వైద్యులు సత్తిబాబు, నిపుణులైన ఇతర వైద్యులతో సుమారు 350 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం 9 మందిని కాకినాడ రిఫర్ చేశారు. అనంతరం శివన్నారాయణ రోగులకు ఉచితంగా మందులు, గర్భిణులకు పౌష్టికాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి ఎం.భైరవమూర్తి. పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకట రమణ, ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, నాయకులు దున్నా శ్రీకాంత్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది కుమార్, ఆంజనేయులు, ఎఎన్‌ఎంలు, ఆశాలు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో నిర్వహించిన శిబిరంలో వైసిపి మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ మాట్లాడారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతోమంది పేదలుకు కార్పొరేట్ తరహా వైద్యం అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటనారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, మెడికల్ సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు.

తాళ్లరేవులో..

కెనాల్ రోడ్డులో పెరుగుతున్న ఆక్రమణలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం కెనాల్ రోడ్డులో ఆక్రమణలు జోరుగా జరుగుతున్నాయి. జాగా కనిపిస్తే చాలు దానిని ఆక్రమించుకుని వ్యాపార కార్యకలాపాలకు ప్రజలు ఉపయోగించు కుంటున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో ఆక్రమణదారుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో రోడ్డు మార్జిన్లు గోదావరి కాలువ గట్లను సైతం వదిలిపెట్టకుండా పలు ఆక్రమణలు తెర కెక్కుతున్నాయి. ఒకరిని చూసి మరొకరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారకలవుతున్నారు. దీనిపై స్థానిక పంచాయతీ అధికారులు ఏ విధంగానూ స్పందించక పోవడం వెనక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని గోదావరి కాలువ గట్టుపై ఉన్న మాచరమ్మ అమ్మవారి ఆలయం మొదలు రోడ్డు మార్గంలోని పలువురు ఆక్రమించుకుని పక్క నిర్మాణాలను చేపడుతున్నారు. ఇటీవల తాజాగా పదుల సంఖ్యలోనే ఆక్రమణలు వెలిశాయి. కెనాల్ రోడ్డు అసలే ఇరుకు కావడంతో ఎదురు ఎదురుగా రెండు భారీ వాహనాలు వస్తే అవి తప్పుకునే మార్గం సరిపోక కష్టతరమవుతోంది. ఈ పరిస్థితుల్లో ఉన్న కాస్త రోడ్డు మార్గంలో ఆక్రమణలకు గురి కావడం వల్ల రోడ్డు ప్రమాదాలు విపరీతమైన అవకాశాలు ఉన్నాయి. దానికి మించి ఆ దుకాణాల్లో ఏదైనా వస్తువులు కొని కొంత అస్సలదిగా వెలుతిరిగితే వాహనాలకు బలై ప్రమాదాలు ఉన్నాయి. ఎంత జరుగుతున్న పంచాయతీ అధికారులు నెమ్మకు నీరెక్కినట్టు ఎలాంటి చలనం లేకుండా ఉన్నారు. ఒకవైపు ఆర్ అండ్ బి శాఖ మరోవైపు ఇరిగేషన్ శాఖలకు ఈ స్థలాలు సంబంధం ఉండగా వారు సైతం ఈ ఆక్రమణలను పట్టించుకోవడం లేదు. మండలంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారా? లేదంటే ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఓట్ల కోసం ఎవరిని ఇబ్బంది పెట్టకూడదని మౌనం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కెనాల్ రోడ్డులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రమాదాలకు తావులేకుండా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కెనాల్ రోడ్డులో అక్రమంగా నిర్మించిన షెడ్డు

నేరాలు ఘోరాలు

లైంగిక దాడికి యత్నం కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి-కాట్రేనికోన

హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్టు కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. కాట్రేనికోన మండలం పల్లం గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై పల్లంకుర్రు శివారు పోర గ్రామానికి చెందిన దొక్కాడి పెదమాత రాజు 2018లో లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ క్రాంతి కుమార్ కేసు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో శ క్రవారం రాజమండ్రి 8వ జిల్లా జడ్జి ముద్దాయికి ఏడేళ్లకఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి బలి

ప్రజాశక్తి -దేవరపల్లి

డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఒక వ్యక్తి మరణించిన సంఘటన దేవరపల్లి మూడు రోడ్ల కూడలిలో శుక్రవారం చోటు చేసుకుంది. దేవరపల్లి సెంట్రల్ లైటింగ్ నిర్మాణంలో భాగంగా మూడు రోడ్ల కూడలి వద్ద పోల్ నిర్మాణ క్రమంలో భారీ క్రేన్ సాయంతో పోల్ నిలబెడుతున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ అజాగ్రత్త వల్ల అదే మార్గంలో వస్తున్న గౌరీపట్నం గ్రామానికి చెందిన కుంచం సత్యానందం(30)పై కరెంటు పోల్ పడిపోవడంతో అక్కడికక్కడే మరణించాడు. సత్యానందంకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.

మిస్టరీగా మారిన వ్యక్తి అదృశ్యం కేసు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన వ్యక్తి అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. పెద్దాపురం మండలం దివిలికి చెందిన కాకి నందకుమార్ మొబైల్ వ్యాపారం, ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఫైనాన్స్ వ్యాపారంలో భాగంగా గురువారం గోకవరం బయలుదేరి వెళ్లాడు. మధ్యాహ్నం తాను ఇంటికి వచ్చేస్తున్నానని జగ్గంపేటలో ఉన్నానని బంధువులకు సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత ఏమైందో ఏమో తెలియదు. అతను తీసుకువెళ్లిన తమ్ముడి బైక్ జగ్గంపేట మండలం రామవరం శివారులో పడి ఉంది. దివిలికి చెందిన తమ్ముడు స్నేహితులు గోనేడ వైపు వెళుతూ బైక్ చూసి తమ్ముడికి ఫోన్ చేశారు. వెంటనే నందకుమార్ తమ్ముడు అక్కడికి చేరుకొని బైక్ ఆ ప్రదేశంలో ఉన్న చెప్పులను గమనించాడు. ఆ చుట్టుపక్కల ప్రదేశంలో వెతికి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల సాయంతో బంధువులు చట్టుపక్కల ఉన్న, కాకినాడ, రాజానగరం ఆసుపత్రులను పరిశీలించారు. దీంతో అదశ్యం కేసు నమోదు చేశారు. శుక్రవారం రామవరంలోని సిసి కెమేరాలను పోలీసులు పరిశీలించారు. ఆ సిసి కెమెరాల్లో అటు వైపుగా బైకుపై వెళ్లినట్లు కనిపించకపోవడంతో ఆ వాహనం అక్కడికి ఎలా వెళ్ళింది అనేది మిస్టరీగా మారింది. పోలీసులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలంలోని గ్రామాల్లో ఎస్ఇబి అధికారులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు సినట్టు సిఐ పి.అశోక్ తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశ పెట్టమన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకన్నదొర, ఎ.రాజు, రాంబాబు, ఎం.వీరభద్రరావు, జ్యోతి ఉన్నారు.

సిఎంగా జగన్‌తో ప్రజా సంక్షేమం, అభివృద్ధి

ప్రజాశక్తి - పెద్దాపురం

సిఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ద్వారానే రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మరిగిడమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన 'జగనే సిఎం ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కరరావు, విజ్జపు రాజశేఖర్, ఆరేళ్ల వీర రాఘవ, పప్పుల దుర్గారావు, కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, గహ సారథుల పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణలోని శోభా థియేటర్ వీధి నుంచి మసీదు సెంటర్ వరకూ రూ.13 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణానికి శుక్రవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరు దొరబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ వార్డులో గుర్తించిన సమస్యల పరిష్కారానికి మంజూరు చేసిన నిధులతో ఈ డ్రైన్ నిర్మిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ డిఇ ఆదినారాయణ రావు, ఎఇ వనజ, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ అమీనా, ఆరెళ్ల వీరరాఘవ, కో ఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ పాల్గొన్నారు.

రూ.2 కోట్ల రైతు నేస్తం రుణాల పంపిణీ

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

నాగులపల్లి సొసైటీ ద్వారా రూ.రెండు కోట్ల రైతు నేస్తం రుణాలను 19 మంది రైతులకు పంపిణీ చేసినట్టు సొసైటీ అధ్యక్షులు అబ్బిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. నాగులాపల్లి సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఈ ఏడాది లాభాల్లో రైతుల షేర్ ధనం, ఐదు శాతం డివిడెంట్‌ను రైతుల ఖాతాలకు జమ చేసినట్టు చెప్పారు. సొసైటీ అభివృద్ధికి సహకరిస్తున్న పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఆకుల వీర్రాజు, బ్యాంకు సిఇఒ సిహెచ్.నరసింహారావు, బ్యాంకు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యానాం వార్తలు

కలశంను ప్రదర్శిస్తున్న ఎంఎల్ఎ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి

యానాంలో 'మేరీ మిట్టీ మేరీ దేశ్'

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా శుక్రవారం అమత్ కలశ యాత్రను స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కలశంలో వేసి విద్యార్థులు, యువత యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశం, ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పి.లక్ష్మణ ప్రవీణ్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు, ఎన్‌సిసి ఆఫీసర్లు, జవహర్ నవోదయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం చిల్డ్రన్స్ ఆడిటోరియంలో మాజీ సైనికులు జివిస్. సాయి బాబు, కె.మాణిక్యాలరావు, ఎన్.వెంకటరమణను ఎంఎల్ఎ సత్కరించారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడాకారులకు యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కిట్లును పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక ఇండోర్ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అథారిటీ అధికారులు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొల్లపల్లిని సత్కరించారు.

డ్వాక్రా రుణాల మంజూరుకు చర్యలు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని అన్ని డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ మేరకు డిఆర్‌డిఎ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌ను కలిసినట్టు తెలిపారు. గతంలో గ్రూపునకు రూ.ఐదు లక్షల చొప్పున రుణాలు మంజూరు చేశారని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఒక్కో గ్రూపునకు రూ.10 లక్షల చొప్పున రుణాలు మంజూరు చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను కోరినట్టు ఆయన తెలిపారు. గతంలో 23 గ్రూపులకు రుణాలు మంజూరు చేశారని, ప్రస్తుతం 438 గ్రూపులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. రుణాలు కోసం డ్వాక్రా మహిళలు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్నారని, త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని ఎంఎల్ఎ డైరెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ హామీ ఇచ్చినట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి తెలిపారు.

చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి-గొల్లప్రోలు (పిఠాపురం), పెద్దాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతరంగం విశిష్టతను గుర్తించి చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పరికరాలు చేనేత కళాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పిఠాపురం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి గుడి దగ్గర బత్తుల మురళి కళావేదిక వద్ద జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ సంజీవ్ కుమార్, కాకినాడ ఎంపీ వంగా గీత, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పాల్గొన్నారు. గొల్లప్రోలు క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం నిధులతో మంజూరైన చేనేత పరికరాలు, సోలార్ లైటింగ్ యూనిట్స్‌ను చేనేత కార్మికులకు అందజేశారు. చేనేత కళాకారులకు వైఎస్సార్ చేనేత పింఛన్ పత్రాలతో పాటు శిక్షణ పొందిన వీవర్స్‌కు గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని గొల్లప్రోలు చేనేత క్లస్టర్‌కు సంబంధించి తాటిపర్తి గ్రామంలో సుమారు 400 మంది చేనేత కుటుంబాలతో మమేకమైన గొప్ప అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. చేనేత కార్మికులు గతంలో చాలా దుర్భరమైన జీవితాన్ని గడిపే వారిని ఆయన అన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందును గుర్తించి వారి అభివద్ధికి కృషి చేస్తునాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నేతన్నలకు ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చే విధంగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ప్రతి ఏటా రూ.24 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని, 16 చేనేత కులాలకు సంబంధించిన నాలుగు ప్రత్యేక కార్పొరేషన్లు కూడా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు ఎంపీ తెలిపారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గొల్లప్రోలు చేనేత క్లస్టర్ అభివద్ధి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.101 లక్షలకు సంబంధించి తొలి దశగా రూ.30 లక్షల విలువైన చేనేత పరికరాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ పరికరాలతో మంచి నాణ్యమైన ఉత్పత్తులను, వేగంగా అందించేందుకు నేతన్నలకు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. ఇందులో 38 మగ్గం ఉపకరణాలు, 259 సోలార్ లైటింగ్ యూనిట్స్‌ను 90 శాతం సబ్సిడీపై చేనేత కార్మికులకు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. దేశ సరిహద్దుల్లో పని చేస్తున్న జవాన్, వ్యవసాయం చేస్తున్న రైతులు చాలా శ్రమ పడుతున్నారని, చేనేత రంగంలో నేతన్నలు చేస్తున్న కృషి చాలా విలువైనదని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ ఆర్‌డిడి బి.ధనుంజయ్ రావు, కె.పెద్దిరాజు, ఎడిఒ డి.రాంబాబు, గొల్లప్రోలు మండలం ఎంపిపి రామన్నదొర, జెడ్‌పిటిసి వి.నాగలోవరాజు, ఎఎంసి చైర్మన్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు. చేనేత పరిశ్రమను పరిరక్షించి చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించాలని కర్నూలు ఎంపీ ఎస్ సంజయ్ కుమార్‌కు ఆప్కో మాజీ డైరెక్టర్, చేనేత సొసైటీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి,

పరికరాలు అందజేస్తున్న ఎంపీలు, ఎంఎల్ఎ, కలెక్టర్

గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో చేనేత క్లస్టర్లను ప్రారంభించిన కర్నూలు ఎంపీ సంజయ్ కుమార్,కాకినాడ ఎంపీ వంగా గీత శుక్రవారం రాత్రి పెద్దాపురం మెయిన్ రోడ్డులోని చేనేత సొసైటీని సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తయారుచేసిన చేనేత వస్త్రాలను వారు పరిశీలించారు. కార్మికుల నైపుణ్యాన్ని ప్రశంసించారు. అనంతరం వీర్రాజు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ చంద్రకళ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దిరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు ఆరెళ్ల వీర రాఘవ, కట్టా రాజబాబు, పప్పుల దుర్గారావు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, గాంధీ చేనేత సొసైటీ అధ్యక్షుడు తూతిక సత్యనారాయణ, సొసైటీ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాలకి కృషి చేయాలన్నారు. ఎంపిటిసి జాగు వీరభద్రరావు, చదలాడ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి మాట్లాడుతూ కాకినాడ-తామరాడ ఆర్‌టిసి బస్సును పునరుద్ధరించమని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఏటుపట్టు గ్రామాల నుంచి కాకినాడ ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు ఈ బస్సు సౌకర్యం లేక ఎన్నో అవస్థలు పడుతున్నారన్నారు. వైస్ ఎంపిపి మిర్యాల రాజా మాట్లాడుతూ నెల రోజుల్లోగా బస్సును పునరుద్ధరించాలని, అందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కాండ్రకోట సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యలపై ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 24 గంటలూ వీధిలైట్లు వెలుగుతున్నా పట్టించుకున్న వారు లేరన్నారు. ఎంపిపి సత్యవతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుత సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు వజ్రపు జితేంద్ర, ఎంపిడిఒ అశోక్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు బిక్కిన శేషకుమారి, రాజశేఖర్, మండల విస్తరణ అధికారి మూర్తి, ఎఇఒ సత్యనారాయణ, వ్యవసాయ అధికారి సంజయ్ కుమార్, సిడిపిఒ జి.ఉష, ఉద్యానవన అధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

బాలమందిరం దసరా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. శుక్రవారం మాధవపట్నం బాలమందిరంలో జరిగిన సభకు పంచాయితీ వార్డు మెంబర్ తోలుం లోవరాజు అధ్యక్షత వహించారు. సంఘమిత్ర అధ్యక్షుడు మహ్మద్ ఖాజా, సంఘమిత్ర కోశాధికారి శ్రీప్రకాష్ రావు, బాలమందిరం అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు. డిసెంబర్ నెలలో బాలమందిరం 8వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తామని అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు.

విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న చేస్తున్న ప్రతినిధులు

240 మందికి కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇటీవల కంటి ఆపరేషన్లు చేయించుకున్న 240 మంది రోగులకు ఉచితంగా కళ్ళజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. సామర్లకోట మండలం ఉండూరులో ఈ నెల 2న పంతం సీతారామ బాలాజీ జ్ఞాపకార్థం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న ప్రజలకు జనసేన నాయకులు కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సరోజ వాసు, యువత పాల్గొన్నారు

మామిడికుదురులో జరిగిన 'బాబుతో నేను' కార్యక్రమం

టిడిపి ఆధ్వర్యంలో 'బాబుతో నేను'

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో శుక్రవారం బాబుతోనేను కార్యక్రమం నిర్వహించారు. వివరాలు ఇవి..

మామిడికుదురు రాష్ట్రంలో కక్ష సాధింపు పాలన కొనసాగుతోందని దానికి ముగింపు రోజు దగ్గరలోనే ఉందని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జనసేన మండల శ్రేణులతో కలిసి బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెదపట్నంలంక సర్పంచ్ సుందరనీడి రాజేష్ కుమార్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బోనం బాబు, ఈలి శ్రీనివాసరావు, చుట్టుగుళ్ళ కిషోర్, కడలి నూకరాజు, సుధా బాబ్జి, జాలెం శ్రీనివాసరావు, బందెల పద్మ, వర్జినేని వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలు విడనాడి చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. కపిలేశ్వరపురంలో బాబుతో నేను కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత గ్రామంలో అంబేద్కర్, ఎన్.టి.ఆర్., విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తోందని, అభివృద్ధి లేక అధిక ధరలతో సామాన్యులు విలవిలలాడుతున్నారని మాజీ ఎంఎల్ఎ, అమలాపురం నియోజకవర్గ టిడిపి ఇన్ చార్జ్ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు గొల్లవిల్లిలో శుక్రవారం టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ స్వగృహం వద్ద టిడిపి క్లస్టర్ సమావేశాన్ని క్లస్టర్ ఇన్ ఛార్జ్ లంకే భీమరాజు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ నల్లా బాబండి, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మిలేరులో టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-ఆలమూరు

మాజీ సిఎం చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులకు నిరసనగా టిడిపి నాయకులు శుక్రవారం గుమ్మిలేరులో వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులంతా బస్టాండ్ సెంటర్లో ఒంటి కాలిపై నిల్చుని వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన ప్రత్యేక హోదా సాధన, పోలవరం పూర్తి, సిపిఎస్ రద్దు, అమరావతి నిర్మాణం, జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల వంటి ముఖ్యమైన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపద సమయంలో అండగా నిలుస్తాం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



భువనేశ్వరితో టిడిపి నాయకులు

మాజీ సిఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని రాజమహేంద్రలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ, మండలానికి చెందిన టిడిపి నాయకులు కలిశారు. చంద్రబాబు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన నాటి నుంచి చంద్రబాబుకు మద్దతుగా తాము చేస్తున్న ఆందోళనలు, పోరాటాలను ఈ సందర్భంగా భువనేశ్వరికి వివరించారు. ఈ ఆపద సమయంలో తామంతా అండగా నిలుస్తామని తెలిపినట్టు లక్ష్మీనారాయణ తెలిపారు. భువనేశ్వరిని కలిసిన వారిలో నాయకులు మంచెం బాబీ,గొలకోటి చిన్న,ఆకేటి పెద్ద,ఆకేటి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -అయినవిల్లి

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. నేదునూరులో రూ.40 లక్షల వ్యయంతో గడప..గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులులో భాగంగా సిపి రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఎంఎల్ఎ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారుల అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. అనంతరం మాగం గ్రామంలో ఐసిడిఎస్ నిధులు రూ.38 లక్షల వ్యయంతో నిర్మించిన కేశవ స్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ నూతన భవనాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు.కార్యక్రమాలలో నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, మాగం సర్పంచ్ కాశి సత్యనారాయణ, మాగం సొసైటీ అధ్యక్షులు సుబ్బరాజు, ఎఎంసి చైర్మన్ వేటుకూరి వెంకటరాజు, జెఎస్ అధ్యక్షుడు పులిదిండి ప్రభాకర్,అయినవిల్లి మండల అధ్యక్షుడు కుడిపూడి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మాగం గ్రామంలో సొసైటీ భవనం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చిట్టిబాబు

మామిడికుదురు గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల ఆధునికీకరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అన్నారు. పెదపట్నం లంకలో పలు సిసి రోడ్ల ఆధునికీకరణ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి రాజేష్ కుమార్, కొమ్ముల రాము, కొమ్ముల సూరిబాబు, విప్పర్తి నాగేశ్వరరావు ,తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్, రిల్ మేకింగ్, డ్రామా పోటీల్లో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారు. శుక్రవారం విజేతలు జాహ్నవి, రేష్మ రమ్య, గుణ, రమేష్, అలేఖ్యలను స్థానిక డిగ్రీ కళాశాల్లో ఏర్పాటు చేసిన అభినందన సభలో వక్ష శాస్త్ర, అర్థశాస్త్ర అధ్యాపకులు చాపల అభినయ్, జె.నెహ్రూ నాయక్, ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు, రిబ్బన్ క్లబ్ చైర్మన్ ఎ.ఆనందరావులు సర్టిఫికెట్లు బహూకరించి అభినందించారు.

వైఎస్ఆర్ ఆసరా మంజూరు పత్రాల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్ఆర్ ఆసరా మంజూరు పత్రాల పంపిణీ చేశారు. చొప్పెల్ల, మూలస్థానం అగ్రహారం గ్రామాలకు చెందిన సత్యసాయి, సాయిలక్ష్మి మహిళా సంఘాలకు చెందిన ఆసరా పథకం రూ.4.87 లక్షల సొమ్ము సాంకేతిక కారణాల వల్ల విడుదల నిలిచిపోయింది. దీనిపై స్పందించిన ఎంపిపి తొరాటి లక్ష్మణరావు, ఎంపిడిఒ కె.జాన్ లింకన్ సంబంధిత రికార్డులను పరిశీలించి సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో జిల్లా వైఎస్ఆర్ వెలుగు శాఖ నిలిచిపోయిన సొమ్ము మొత్తాన్ని మంజూరు చేసింది.

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో సర్పంచ్‌కు అవమానం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కాలేరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో తమకు అవమానం జరిగిందంటూ ఆ గ్రామ సర్పంచ్ దాయం కావేరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ అధ్యక్షతన జరగవలసిన కార్యక్రమానికి ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి తనను స్టేజ్ పైకి పిలవడం జరిగిందన్నారు. అయితే తనను పక్కన పెట్టి ఉప సర్పంచ్ ను పిలిచి మాట్లాడమని చెప్పడంతో సభ నుంచి తాను దిగి బయటకు వచ్చేసినట్లు తెలిపారు. ఈ విధంగా చేయడం పట్ల తమకు తీరని అవమానం జరిగిందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

వాకతిప్పలో ఉపాధి హామీ గ్రామసభ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వాకతిప్ప గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోరిపెల్ల వెంకట నాగస్రవంతి అధ్యక్షతన జరిగిన జరిగిన సభలో ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ వెంకటలక్ష్మి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో చేపట్టవలసిన ఉపాధి పనుల ప్రణాళిక నివేదిక వివరించారు. గ్రామంలో పనులు చేపట్టేందుకు చర్చలు జరిపారు. గ్రామ పరిధిలో చేపట్టబోయే పంటబోదెలు, కాలువల పూడికతీత, చెరువులకు సంబంధించి 53 పనులు, గుర్తించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ టి.గణేష్ తెలిపారు. గుర్తించిన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనన్నట్లు ఎపిఒ వెంకటలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు, కార్యదర్శి యశ్వంత్ కుమార్, ఫీల్డ్అసిస్టెంట్ తనుకు గణేష్, సచివాలయ సిబ్బంది, వారంటీర్లు, ఉపాధి మేట్లు, కూలీలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు

పేరు మార్పు

తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం, చీపురుపల్లి గ్రామం, డో.నెం.2-199రు కాపురస్తులు చిలకాని ముత్యాలయ్య గారి కుమారుడు చిలకాని అబ్బులు అనే చిలకాని నల్లబ్బులు తెలియజేయునది ఏమనగా ప్రస్తుతం నా ఆధార్ కార్డు నందు నా పేరు **చిలకాని నల్లబ్బులు** గా ఉంది. కావున ఇకపై నా పేరును **చిలకాని అబ్బులు అనే చిలకాని నల్లబ్బులు** గా పరిగణించవలెనని తెలియజేయుచున్నాను.

చిలకాని అబ్బులు అనే చిలకాని నల్లబ్బులు
డో.నెం. 2-199, చీపురుపల్లి గ్రామం, సీతానగరం మండలం, తూర్పు గోదావరి జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. No. 6/2020 in O.S. No. 586/2020

Between:
Meesala Srinivas, S/o. Subbarao, age 36 yrs, Cultivation and Business, Hindu, D.No. 2-130, Pedda Veedhi, Pandalapaka Village, Bikkavolu Mandal, East Godavari District, Pin: 533345, Anaparthi JCJC Limits.
...Petitioner/ Plaintiff
AND
1. Marrapu Prasanna, W/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.
2. Marrapu Mothik Kumar, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 25 yrs, Hindu, Business, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.
3. Marrapu Lohit, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.
...Respondents/ Defendants

పై నంబరు పిటిషన్‌లో 1, 2, 3 రెస్పాండెంట్లు/ ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **దీ. 09-11-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **Md.M.చిస్తి**
18-10-2023 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 586/2020

Between:
Meesala Srinivas, S/o. Subbarao, age 36 yrs, Cultivation and Business, Hindu, D.No. 2-130, Pedda Veedhi, Pandalapaka Village, Bikkavolu Mandal, East Godavari District, Pin: 533345, Anaparthi JCJC Limits.
...Plaintiff
AND
1. Marrapu Prasanna, W/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.
2. Marrapu Mothik Kumar, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 25 yrs, Hindu, Business, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.
3. Marrapu Lohit, S/o. Marrapu Purna Venkata Sai Babu (late), age 43 yrs, Hindu, House wife, R/o. D.No. 42-9-4, Kotha Peta, Near Railway Gate, Narisipalli vari Street, Rajamahendravaram, Rajamahendravaram Urban Mandal, E.G.Dist., Rajamahendravaram JCJC Limits.
...Defendants

పై నంబరు దావాలో 1, 2, 3 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **దీ. 09-11-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **Md.M.చిస్తి**
18-10-2023 అడ్వకేట్, రాజమండ్రి